క్లుప్తంగా

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


పెదలింగాలవలసలో పిల్లలకు వ్యాక్సినేషన్ చేస్తున్న సిబ్బంది

లావేరు: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని లావేరు, మురపాక పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మణిభూషణ్, డాక్టరు సౌమ్య అన్నారు. మండలంలోని 23 సచివాలయాలు పరిధిలోని గ్రామాల్లో సచివాలయాల ఏఎన్ఎంలు పిల్లలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. పిల్లల ఆరోగ్యంపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.కార్యక్రమాన్ని వైద్యులు పర్యవేక్షించారు.

వినాయక ఉత్సవాలకు పందిరిరాట


పందిరి రాట వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఇలిసిపురం రైతు బజారు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు బుధవారం పందిరిరాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. హారిక కన్‌స్ట్రక్షన్స్ అధినేత హారిక ప్రసాద్, శోభారాణి ఈ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లకుండా మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు హారిక ప్రసాద్ తెలిపారు. జిల్లాలోనే అతిపెద్ద మట్టి విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇలిసిపురం వాసులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య లేకుండా చర్యలు


పనులు చేపడుతున్న దృశ్యం

లావేరు: వేణుగోపాలపురం గ్రామంలో మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని గుమడాం పంచాయతీ సర్పంచ్ జి.పైడయ్య, ఉప సర్పంచ్ దురగాసి ధర్మారావు చెప్పారు. దీనిలో భాగంగా రక్షిత మంచినీటి పథకం నుంచి డైరక్టు పంపింగ్ స్కీం ద్వారా బుధవారం పనులు చేపట్టారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని గుడివీధి ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయం వద్ద గల గంగామాత ఆలయంలో సుబ్రమణ్యస్వామికి బుధవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా విశేష పూజలు చేపట్టారు. అర్చకులు పెంట కిరణ్‌శర్మ స్వామివారికి అభిషేకాలు, హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

పాడి పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న డాక్టర్ గాయత్రి

లావేరు: పాడి పశువుల పెంపకంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలని లావేరు పశువైద్య కేంద్రం అధికారి డాక్టరు బి.గాయత్రి అన్నారు. తాళ్లవలసలోని రైతు భరోసా కేంద్రంలో పాడి రైతులతో బుధవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. పశువులకు వ్యాధులు సోకితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సేవలు అందించాలన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ జి.లక్ష్మీకాంతం ఉన్నారు.

అల్లినగరంలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: అల్లినగరం గ్రామంలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధులు, కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని సచివాలయ సిబ్బంది స్థానికులకు అవగాహన కల్పించారు.

గోకుల కృష్ణ.. గోపాల కృష్ణ..

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. పాఠశాలలు, ఆలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పిల్లలు శ్రీకృష్ణుడుగా..గోపికలుగా ముస్తాబై అలరించారు. చిలిపి కృష్ణుడు వేషధారణలో పిల్లలను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పలు గ్రామాల్లో హరేరామ.. హరేకృష్ణ నామ సంకీర్తనలతో.. శ్రీకృష్ణుని చిత్రపటంతో తిరువీధి నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమాల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.


శ్రీకాకుళం కల్చరల్: కలామ్స్ స్కూల్లో చిన్నారుల వేషధారణలు


శ్రీకాకుళం కల్చరల్: బలగ హరేరామ మందిరంలో చిన్నారులు


ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు


శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరాలయంలో వేణుగోపాల స్వామికి పూజలు


శ్రీకాకుళం కల్చరల్: అర్షవిజ్ఞాన వాటికలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు


శ్రీకాకుళం న్యూకాలనీ: చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్న గుడివీధికి చెందిన బాలలు


శ్రీకాకుళం కల్చరల్: ఇస్కాన్‌లో కోలాటం చేస్తున్న మహిళలు


శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని విశాఖ స్కూల్‌లో కృష్ణాష్టమి సందర్భంగా కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

సైనికుల్లా పని చేయాలి

● ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బాతువ గ్రామంలో పార్టీ కార్యకర్తలు, కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులతో ఆత్మీయ కలయిక కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ సమన్వయంతో వ్యవహరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చారని..ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పేదలకు మేలుజరగకుండా తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ పల్లేటి సన్యాసిరావు, కలిశెట్టి శాంతారావు, ఎంపీటీసీ సభ్యురాలు బూటు దమయంతి, పార్టీ నాయకులు బూటు అప్పారావు, మీసాల కన్నం నాయుడు, అప్పలనాయుడు, కన్నారావు, రమణ, సన్యాసినాయుడు, రామారావు, సురేష్, గొల్లారావు, శ్రీనివాసరావు, చిరంజీవి, నారాయణరావు పాపినాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 20 కుటుంబాలు చేరిక

బాతువ గ్రామానికి చెందిన 20 కుటుంబాలు ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. మీసాల కృష్ణ, రామారావు, రమణలతోపాటు మరో 17 కుటుంబాలు పార్టీ తీర్థపుచ్చుకోగా.. వీరికి కిరణ్‌కుమార్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

రణస్థలం: గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. జె.ఆర్.పురం-1 గ్రామ సచివాలయంలో జె.ఆర్.పురం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలతో ముఖాముఖీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో కార్యకర్తలు అహర్నిశలు కష్టపడి 2019లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు ప్రధాన కారణమయ్యారని.. అదే స్ఫూర్తితో 2024 ఎన్నికల్లో పని చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు టీడీపీ నాయకులు కల్లబొల్లి మాటలతో ఓటర్లను ఏమార్చేలా గ్రామాల్లో తిరిగేందుకు సిద్ధమౌతున్నారని, వారి కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఒక్కో కార్యకర్తతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, నాయకులు పచ్చిగుళ్ల సాయిరాం, దన్నాన సీతారాం, ఇ.తిరుపతిరాజు, పిన్నింటి సత్యంనాయుడు, టీకి బ్రహ్మాజీ, మింద్రాన రామారావు, రాయపురెడ్డి శ్రీను, శారదా, పిన్నింటి గౌరినాయుడు, ముద్దాడ రాజశేఖర్, తాజ్ హుద్దీన్ ఉన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న దృశ్యం


రణస్థలం: కార్యకర్తలతో సమావేశమైన కిరణ్‌కుమార్

వాత్సల్యగ్రేసికి అభినందన


వాత్సాల్య గ్రేసిని అభినందిస్తున్న డీఈఓ వెంకటేశ్వరావు, ఇక్రా ఫౌండేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏ ఆధారము లేకుండా బతుకు సాగిస్తున్నవారికి ఆసరాగా నిలుస్తున్న ఇక్రా ఫౌండేషన్ సేవలు ప్రసంశనీయమని డీఈఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఇక్రా ఫౌండేషన్‌కు దాతల నుంచి విరాళాలు సేకరించడంలో ఎంతో సహకరిస్తున్న వాత్సల్యగ్రేసిని బుధవారం సత్కరించారు. వాత్సాల్య మడపం గ్రామానికి చెందిన పాలకొండ శివకుమార్ కుమార్తె వాత్సల్య గ్రేసి చిన్న వయస్సులో సమాజ అభ్యున్నతి కోసం చేస్తున్న కృషిని మెచ్చుకున్నారు. బలగ ప్రసాద్, మానవ హక్కుల కార్యకర్త లోసు భూషణరావు, వాత్సల్యగ్రేసి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

8న లావేరులో జగనన్నకు చెబుదాం


ఎంపీడీఓ సురేష్ కుమార్

లావేరు: లావేరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల ఎనిమిదో తేదీన 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసం మండలాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారని అందులో భాగంగా లావేరులో జిల్లాలోనే తొలిసారిగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరు కావడం జరుగుతుందన్నారు. 8వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మండలంలోని ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు సూపరింటెండెంట్ సునీత, సీనియర్ అసిస్టెంట్ మాధవరావు ఉన్నారు.

26 నుంచి వ్యాసరచన పోటీలు


మాట్లాడుతున్న సత్యసాయి సమితి జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా శతజయంతి వేడుకలలో భాగంగా విద్యార్థులకు మానవతా విలువల ప్రాముఖ్యతను తెలియజేసేలా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సమితి జిల్లా అధ్యక్షులు ఎన్ని లింగరాజు తెలిపారు. స్థానిక బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి బృందావనంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ సహాయంతో జిల్లాలో గల ఉన్నత పాఠశాలల, డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులకు వారి కళాశాలల్లోనే ఈ నెల 26 నుంచి 29 వరకు రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు తెలుగు, ఇంగ్లిష్ విభాగాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ప్రథమ స్థానం పొందిన వారికి రాష్ట్ర స్థాయిలో ప్రశాంత నిలయంలో బంగారు పతకం అందించడం జరుగుతుందన్నారు. వ్యాసరచన పోటీలో పాల్గొన్న వారికి సత్యసాయి సేవా సంస్థల నుంచి ధ్రువపత్రాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా, సేవాదళ్ సమన్వయ కర్త సూరరామచంద్రరావు, విద్యావిభాగం సమన్వయ కర్తలు శశికాంత్, సూర్యకళ, ఆధ్యాత్మిక సమన్వయకర్త ఎస్.అనాథగుప్త, యువ విభాగం కన్వీనర్ ఎ.శివకుమార్, ప్రతినిధులు బి.నరసింహమూర్తి, పడాల ప్రసాదరావు, అప్పారావు, శ్రీనివాసరావు, లక్ష్మణమూర్తి, లిఖిల్, చరిష్మా, శేఖర్, జోనల్ కన్వీనర్ నాగేశ్వరరావు, కన్వీనర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

కొత్తపింఛన్లు అందజేత


పింఛన్లు అందజేస్తున్న నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: భగీరథపురంలో ఎనిమిది మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తి, స్థానిక నాయకుడు గొలివి అనంతరావు బుధవారం పింఛన్లను అందజేశారు.

ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలోని ఇస్కాన్ (అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగన్నాథ్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. గురు, శుక్రవారం కూడా వేడుకలు జరుగుతాయి. ఇందులో భాగంగా తొలిరోజు భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు కోష్టలో వేడుకలు

రణస్థలం: రణస్థలం-కోష్ట గ్రామాలకు మధ్యలో జాతీయ రహదారి పక్కన ఉన్న హరేకృష్ణ నగర్‌లోని రాధా గోవింద మందిరములో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం నిర్వహిస్తున్నట్లు మందిరం సేవా భక్త బృంద సభ్యులు బుధవారం తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సంపూర్ణ మహాప్రసాద వితరణ ఉంటుందన్నారు.

10న స్వరసుధ గాత్ర కచేరీ

శ్రీకాకుళం కల్చరల్: తరుణికృష్ణ స్మారక ధార్మిక ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ సాయంత్రం స్వరసుధ శాస్త్రీయ గాత్ర సంగీత కచేరీ జరుగుతుందని నిర్వాహకులు మండ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన గురువైన స్వర్గీయ మండ కృష్ణ రామ్‌ప్రసాద్ జయంతి సందర్భంగా విశాఖకు చెందిన ప్రాతా కృష్ణమూర్తితో స్వరసుధ, సుసరావు లక్ష్మీ గణపతి శర్మతో వాయులీన వాదనం కార్యక్రమం ఉంటుందన్నారు. సంగీత అభిమానులంతా పాల్గొనాలని కోరారు.